క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల గ్రామ సచివాలయం వద్ద ఉచిత వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. విజయవాడకు చెందిన హెల్ప్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సౌజన్యంతో గుండెకు సంబంధించిన వ్యాధులకు వైద్య చికిత్సలు అందజేశారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 100 మందికి వైద్యపరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు హాస్పటల్ వైద్యులు ఆర్.నాగకిరణ్ తెలిపారు. వీరిలో 15 మందికి హెల్ప్ హాస్పిటల్లో పూర్తిస్థాయి చికిత్స ఉచితంగా అందజేస్తామని వైద్యులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో హెల్ప్ మల్టీ స్పెషాలిటీ వైద్యబృందం గ్రామ సర్పంచ్ వి.బ్రహ్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



నూజెండ్ల: శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన రేపు ఘనంగా నిర్వహించనున్నారు. మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన స్వామి వారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గ్రామ వాస్తవ్యులు యెల్లేపల్లి వెంకట సుబ్రమణ్యశాస్త్రి స్థలం అందించగా చందాల రూపంలో వచ్చిన 60 లక్షల నిదులతో గ్రామస్తులు ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. స్వామి వారి అరాధనలో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కమిటీ పెద్దలు కోరారు.

కూరగాయల వ్యాపారిపై దాడి

టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు

నరసరావుపేట టౌన్: కూరగాయల వ్యాపారిపై కొందరు యువకులు దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బాబాపేట వద్ద గల హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో ఇంటూరి నాగేశ్వరరావు కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. నాగేశ్వరరావు దుకాణం పక్కనే తోట సురేష్‌కు కూరగాయల దుకాణం ఉంది. అతని దుకాణానికి సరుకు దించేందుకు వచ్చిన లారీ సురేష్ దుకాణం ఎదుట నిలిపారు. దీంతో సురేష్ వాగ్వివాదానికి దిగి అతని స్నేహితులు ఆర్.పి. వాసు, సుబ్బారావు మరి కొందరితో కలిసి నాగేశ్వరరావుపై దాడికి పాల్పడ్డారు. అనంతరం నాగేశ్వరరావు దుకాణానికి తాళాలు వేసి దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు సోమవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై సీఐ హైమారావును వివరణ కోరగా కూరగాయల వ్యాపారం నిర్వహణలో గొడవ జరిగిందని ఫిర్యాదు అందిందన్నారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గడ్డివామిలో రాజుకున్న అగ్గి



యడ్లపాడు: స్థానిక మేదర వీధిలోని కొండ సాంబయ్యకు చెందిన వరిగడ్డి వామిలో సోమవారం ఉదయం 10.30 సమయంలో దట్టమైన పొగలు రావడం స్థానికులు గమనించారు. సమీపంలోని ఓ ఇంటి పనులు చేసుకుంటున్న వారు అగ్ని రాజుకుంటుందని పసిగట్టి వెంటనే స్పందించారు. మోటర్‌తో నీళ్లు కొట్టగా, మరొకరు జేసీబీను తీసుకువచ్చి వామును పక్కకు నెట్టి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. వాముకు అతి దగ్గరలో ఉన్న గేదెలను సకాలంలో కట్లు విప్పి బయటకు పంపించేశారు. స్థానికుల సమయస్ఫూర్తి, ఆత్మస్థైర్యం వల్ల మంటలు మరింత వ్యాపించకముందే ఆర్పివేయడంతో అంతా పెనుప్రమాదాన్ని తప్పించారని ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ మంటలు ఆకతాయిల నిర్వాకమేనని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వినుకొండలో అన్నదాన కార్యక్రమం



వినుకొండ: ప్రముఖ వ్యాపారవేత్త లింగమల్లు పుల్లారావు జ్ఞాపకార్థం పట్టణంలోని పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రైల్వే స్టేషన్ సాయిబాబా దేవస్థానం ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు పుల్లారావు చిత్రపటానికి పూలమాలలో వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

రహదారి నిర్మాణంలో వివాదం

- అన్యాయమంటూ బాధితులు ఆవేదన
- ఏడు మీటర్ల స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణం



పోలీసుల పర్యవేక్షణలో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అధికారులు అనుమతులు జారీ చేశారు. సోమవారం పోలీసు బందోబస్తుతో స్థలంలో ఉన్న వేప చెట్టును, రాళ్ళగుట్టను పొక్లయినర్‌తో తొలగింపు పనులు చేస్తుండంతో ఉద్రిక్తంగా మారింది. గ్రామానికి చెందిన ఆళ్ల రామమోహనరావు నివాస గృహం ఎదుట ఏడు మీటర్ల ఖాళీ స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా బాధితుల కుటుంబ సభ్యులు పోలీసులకు మధ్య వాదనలు జరిగాయి. ఈ స్థలానికి సంబంధించి అన్ని ఆధారాలు ఉన్ననప్పటికీ అన్యాయంగా గ్రామానికిచెందిన కొందరు, అలాగే అధికారులు కుమ్మక్కై అధికారాన్ని అడ్డుపెట్టుకొని తమ స్థలంలోకి ప్రవేశించారని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలా ఉంటే ఎట్టకేలకు సీసీ రోడ్డు పనులను యంత్రాంగం పూర్తి చేసింది. ఎస్సైలు లేళ్ల లోకేశ్వరరావు, యంవీవీ కృష్ణారావు, కత్తి స్వర్ణలత బందోబస్తును పర్యవేక్షించారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులు



ఆవేదన వ్యక్తం చేస్తున్న రామమోహనరావు, కుటుంబ సభ్యులు

మా ఆధారాలతో ప్రయోజనం లేదట

1983లో మర్రి రత్తమ్మ అదే గ్రామానికి కొర్రపాటి పెద్దబ్బికి అమ్మారు. 2010లో గ్రామానికి చెందిన కొర్రపాటి హనుమంతరావు దగ్గర మా అన్నయ్య 3 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేశాడు. అప్పట్లో రూ.10 రూపాయల స్టాంప్‌పై రాసి ఇచ్చాడు. ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన ఏడు మీటర్ల స్థలం మా అన్నయ్య నుంచి మాకు సంక్రమించింది. సదరు అధికారులకు స్టాంప్ పేపరును చూపిస్తే ఇలాంటి కాగితాలతో ఎలాంటి ప్రయోజనం లేదని చెబుతున్నారు. చివరకు గ్రామ కంఠంగా నిర్ధారణ చేయడం బాధాకరం.

–ఆళ్ళ రామమోహనరావు, బాధితుడు

అది గ్రామకంఠం భూమి

వివాదాస్పదంగా మారిన సర్వేనంబరు 795 నంబరు భూమి గ్రామకంఠం పరిధిలో ఉంది. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు నిర్ధారణ చేశారు. ఆ తరువాత ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు సీసీ రోడ్డు పనులు ప్రారంభించాం.

–చింతా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి



ఆకతాయిల మంట - తెచ్చింది తంట!

రోడ్డు పక్కన చెత్తకుప్పలకు ఆకతాయిలు అంటించిన నిప్పు పలువురిని పరుగులు పెట్టింది. ఈ మంటసమీప ప్రాంతాల్లోకి వ్యాపించడంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపులోకి తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పింది. పేట మండలం మద్దిరాల గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకుప్పలకు నిప్పు పెట్టడంతో చుట్టుపక్కల ఉన్న పిచ్చిమొక్కలు తగలబడుతూ మంటలు జవహర్ నవోదయ విద్యాలయం వద్దకు చేరుకున్నాయి. దీంతో విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు ఫిర్యాదుతో చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి మంటల్ని అదుపులోకి తెచ్చారు. –చిలకలూరిపేటటౌన్

మైనార్టీ ఆడబిడ్డలు, తల్లిదండ్రులకు రక్షణ ఉందా?

- తూర్పుగోదావరి నిడదవోలు సంఘటనపై ముస్లిం నాయకుల ఫైర్
- కూరగాయల మార్కెట్‌సెంటర్‌లో నిరసన



నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు గ్రామనికి చెందిన వలి అనే వ్యక్తిని అతిదారుణంగా హత్య చేసిన అనిల్ అలియాస్ కిరణ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. జరిగిన దారుణంపై సోమవారం స్థానిక లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్‌సెంటర్‌లో ఎంహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ 2021లో వలి కూతురిని హింసిస్తున్న అనిల్‌పై చేసిన ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్టుచేసి జైలుకు పంపించారన్నారు. ఆ కేసు ఇప్పుడు విచారణకు రావటంతో కేసు రాజీకి రావాలని బెదిరింపులకు దిగి రాజీకి ఒప్పుకోని వలిని ఈనెల నాల్గున మజీద్‌కు వెళ్లి వస్తున్న సమయంలో హత్య చేయటం జరిగిందన్నారు. రాష్ట్రంలో హోం మంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ రాష్ట్రంలో మైనార్టీ ఆడబిడ్డలకు వారిని కన్న తల్లిదండ్రులకు రక్షణ ఉందా అంటే ఈ సంఘటనతో లేదనే అనిపిస్తోందన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు బాధ్యుల కుటుంబాలను మహిళా కమిషన్ చైర్మన్ స్పందించి వారి కుటుంబానికి రక్షణ కల్పించాల్సి వుండగా ఇప్పటివరకు ఆ కుటుంబాన్ని ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కనీసం ఫోన్ ద్వారా కూడా మాట్లాడి మనోధైర్యం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. దీనిని బట్టి కూటమి ప్రభుత్వానికి మైనారిటీ ప్రజలకు రక్షణ ఇవ్వటం ఇష్టంలేనట్లుగా కన్పిస్తుందన్నారు. ఇలాంటి సంఘటన మరోసారి జరగకుండా ఉండాలంటే నిందితుడికి ఉరిశిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మాబు, జిల్లా కార్యదర్శి, ఖాసీం పీరా, ఎంబీఎం పార్టీ పట్టణ అధ్యక్షులు మౌలాలి, వలి మేస్త్రి, మాబు శారీఫ్, సైదా, మౌలాలి, అబ్దుల్ కరీం, రొంపిచర్ల మండల అధ్యక్షులు ఇమ్మంషా, కరీముల్లా పాల్గొన్నారు.

ప్రపంచ గతిని మార్చిన సిద్ధాంతకర్త కారల్ మార్క్స్

సీపీఎం కార్యాలయంలో ఘన నివాళి



కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న పార్టీ నాయకులు

నరసరావుపేట: ప్రపంచ గతిని మార్చిన గొప్ప సిద్ధాంతకర్త, ప్రపంచ మానవాళికి దోపిడి విముక్తి సిద్ధాంతాన్ని అందించిన ప్రపంచ మేధావి కామ్రేడ్ కారల్ మార్క్స్ అని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. కారల్ మార్క్స్ 207వ జయంతి సందర్భంగా సోమవారం కోటప్పకొండ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

విజయకుమార్ మాట్లాడుతూ సమాజాన్ని అనేక మంది తత్వ వేత్తలు పరిపరి విధాలుగా విశ్లేషించారని, కష్టజీవుల సమస్యలకు కారణాలను వెతికి సమాజ పరిణామం, వర్గ దోపిడీ ప్రధానమైన కారణమని, కార్మికవర్గానికి అధికారం రావాలని చెప్పే సూత్రాన్ని కనిపెట్టిన మహానేత అని కొనియాడారు. పార్టీ నాయకులు ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయులు నాయక్, రవిబాబు, కామినేని రామారావు, డి.శివకుమారి, సిలార్ మసూద్, హనుమంతరెడ్డి, మల్లీశ్వరి, ఏఐటీయూసీ నాయకులు కాసా రాంబాబు, రంగయ్య, వివిధ సంఘాల నాయకులు రెడ్ బాష, కె.కృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ రామకోటయ్య సేవలు ఆదర్శనీయం

మాచర్ల: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ రామకోటయ్య సేవలు ప్రశంసనీయమని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి కొనియాడారు. ఆదివారం రాత్రి డాక్టర్ వి.ఎల్.దత్తు ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ రామకోటయ్య దంపతుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి, కేసీపీ జనరల్ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కృష్ణా నది ఒడ్డున మారుమూల ప్రాంతాల్లో నివాసం ఉంటున్న మత్స్యకారుల పిల్లలకు ప్రతి సంవత్సరం పల్స్‌పోలియో చుక్కలు వేసి అంతర్జాతీయ పల్స్‌పోలియో అవార్డును డాక్టర్ రామకోటయ్యకు దక్కించుకోవడం అభినందనీయమన్నారు. తన సొంత నిధులతో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించడంతో పాటు, ఈఎస్ఐ వైద్యులుగా ఆయన అందించిన వైద్య సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సుమంత్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కృష్ణకుమారి, కార్యదర్శి నిమ్మగడ్డ సురేఖ, కోశాధికారి లక్ష్మి, డాక్టర్ మురహరిరావు, చెరుకూరి నరసింహారావు, రామూర్తి, పఠాన్ నాగూర్‌వలి, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఉప్పలపాడులో రీసర్వే పనులు ప్రారంభం



నూజెండ్ల: భవిష్యత్‌లో భూ వివాదాలకు తావివ్వకుండా జరుగుతున్న రీసర్వే పనులకు రైతులు సహకరించాలని తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పలపాడు పంచాయతీలో సోమవారం రీసర్వే పనులను ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పంచాయితీ పరిధిలో 3963 ఎకరాలు భూమి గుర్తించామన్నా రు. అందులో ప్రభుత్వ భూమి ఆర్ఎస్సార్ ప్రకారం 666 ఎకరాలు కాగా నిషేధిత జాబితా ప్రకారం 712 ఎకరాలుగా ఉందన్నారు. అసైన్‌మెంట్ జరిగిన భూమి 226, దేవదాయ భూమి 18.35 ఎకరాలుగా గుర్తించామన్నారు. సర్వేలో సర్వేయర్ చండీరాణి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో తెలుగు సాహితీ సంబరాలు

నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీలలో ఏలూరులోని వేణుగోపాల స్వామి కళ్యాణ మండపంలో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహిస్తున్నట్టు కళావేదిక జాతీయ కార్యదర్శి గుండాల రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబరాలలో బాగంగా కవితోత్సవం, సాహితీ సదస్సులు, రంగస్థల ప్రదర్శనలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, పుస్తకా విష్కరణలు నిర్వహించనున్నట్టు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు కవులు, రచయితలు, కళాకారులు దాదాపు రెండువేల మంది సంబరాలలో పాల్గొంటారని తెలిపారు. సాహితీ చరిత్రలో అతి పెద్ద కార్యక్రమంగా నిలుస్తుందనీ, పలు ప్రపంచ రికార్డు సంస్థలు ఈ కార్యక్రమాన్ని వరల్డ్ రికార్డుగా నమోదు చేసేందుకు హాజరవుతున్నట్టు తెలిపారు. కళావేదిక సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో కన్వీనర్లు కొల్లి రమాదేవి, డాక్టర్ పార్థసారధి, జి.ఈశ్వరీ భూషణం కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి

సత్తెనపల్లి: ప్రైవేట్ ఉద్యోగిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసిన ఘటన పల్నాడు సత్తెనపల్లిలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన యువకుడు పోకూరి మణికంఠ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ వర్క్ ఫ్రమ్ హోంలో ఉన్నాడు. కంపెనీ పని నిమిత్తం హైదరాబాదు వెళ్లేందుకు బట్టల బ్యాగు, ల్యాప్‌టాప్ తీసుకొని రైల్వేస్టేషన్‌కు నడుచుకుంటూ వెళుతున్నాడు. రైల్వేస్టేషన్‌రోడ్‌లోని సచివాలయం సమీపంలో ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు గుర్తుతెలియని దుండగులు దాడి చేసి ల్యాప్‌టాప్, బట్టలు బ్యాగును అపహరించుకుపోయారు. దీంతో లబోదిబో మంటూ మణికంఠ పట్టణ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా దాడి చేసిన దుండగులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. పట్టపగలు యువకుడిపై జరిగిన ఈ దాడి ఘటన పట్టణంలో చర్చనీయాంశమైంది.

20న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

నరసరావుపేట: స్వాతంత్రం కంటే ముందే పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను కాల రాసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, వాటి రద్దు కోసం దేశ కార్మిక వర్గం మొత్తం ఉద్యమించాలని సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయునాయక్ పిలుపు నిచ్చారు. సోమవారం కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదానికై వివిధ సంఘాల నాయకులతో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ సమ్మెకు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు భారతదేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం అవుతున్నారని తెలిపారు. సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్, అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, రైతు సంఘ జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి రవిబాబు, కౌలు రైతు సంఘ పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు యడ్లపాడులో ఆలయ వార్షికోత్సవం



యడ్లపాడులోని రాజేశ్వరస్వామి దేవాలయం

యడ్లపాడు: భక్తుల నమ్మకానికి నిలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రాజేశ్వరస్వామి వారి దేవస్థానం 8వ వార్షికోత్సవ మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. వేకువ జామునుండే స్వామి వారికి అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు, పలు రకాల ప్రసాద వినియోగం ఉంటాయన్నారు. సాయంత్రం 6 గంటలకు కంద్రిక, యడ్లపాడు, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాలకు చెందిన భజనమండలీలకు చెందిన 60 మంది హాజరై ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శన ఇస్తారని తెలిపారు. 7 గంటలక కొటప్పకొండకు పండితులు కొండకావూరి అప్పయ్యగురుకులు, ప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు జంధ్యాల శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యాన శివ పార్వతుల శాంతి కల్యాణ వేడుకలు శాస్త్రోక్తంగా జరుగుతాయన్నారు. ఈ పవిత్ర శివ కల్యాణ దర్శనం అనంతరం, రాత్రి 8 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆలయాన్ని సందర్శించి స్వామి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ప్రారంభం



ఇర్లపాడులో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి



రొంపిచర్ల శిబిరంలో చిన్నపిల్లలకు ఆధార్ నమోదు చేస్తున్న డీఏ శ్రీకాంత్

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు, నాదెండ్ల గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ సేవా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఆధార్‌లో సవరణలు, శిశు ఆధార్, ఐదేళ్ళు పైబడిన చిన్నారుల ఆధార్ అప్‌డేట్ తదితర సేవలందిస్తున్నారు. సోమవారం నుండి ఈ నెల 8వ తేది వరకూ, 12–15 తేదిల్లో విడతల వారీగా గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధార్ సేవలందించనున్నారు. ఇర్లపాడులో ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో స్వరూపరాణి పరిశీలించారు.

20 మందికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్

రొంపిచర్ల: అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల విప్పర్ల పీఏసీఎస్ ఆవరణలో సోమవారం ఆధార్ ఎన్ రోల్‌మెంట్ నిర్వహించారు. ఈ శిబిరంలో 20 మంది పిల్లలు, పెద్దలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా సహకార శాఖ అధికారి ఎం. వెంకటరమణ ఆదేశాల మేరకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సొసైటీ చైర్‌పర్సన్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఏ శ్రీకాంత్, సొసైటీ అధికారులు ఎస్.లక్ష్మీరెడ్డి, ఎస్. వీరారెడ్డి, సిబ్బంది వై. లక్ష్మారెడ్డి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



శావల్యాపురంలో ఆధార్ సేవలను పరిశీలిస్తున్న సొసైటీ సీఈవో నారాయణ

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం సొసైటీ కార్యాలయంలో నూతనంగా ఆధార్ సెంటరును ప్రారంభించినట్లు సొసైటీ సీఈవో వై.వి.నారాయణ సోమవారం తెలిపారు. వారానికి రెండు రోజుల వరకు సొసైటీ కార్యాలయంలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆధార్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ మల్లా వరపు గాలెయ్య, రైతులు ఉన్నారు.

వేసవి తాపానికి చల్లని మజ్జిగ ఎంతో ఉపశమనం

పురపాలక సంఘ మేనేజర్ శ్రీనివాసరావు



మజ్జిగ పంపిణీ చేస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

నరసరావుపేట: రోజురోజుకు ఎండ తీవ్రత ఎక్కువ కావటంతో వేసవి తాపానికి చల్లని మజ్జిగ ఎంతో ఉపశమనమని పురపాలక సంఘ మేనేజర్ కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పురపాలక సంఘం కార్యాలయంలో కార్మికులు, శ్రామికులు, అధికారులు, సిబ్బందికి ఒక్కరోజైనా వేసవి తాపాన్ని తీర్చేందుకు ఏపీ ఎడిటర్స్ అండ్ రిపోర్టర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన చల్లటి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మేనేజర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ రమాదేవి, ఆర్ఐ బెయిలీ బాబు, టీడీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి రవి, 15వ వార్డు మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిల్లి యజ్ఞనారాయణ, ప్రధాన కార్యదర్శి పొన్నేకంటి శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కోశాధికారి నాగెండ్ల వెంకటేశ్వర్లు, జిలానిమాలిక్ పాల్గొన్నారు.

వేసవిలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న అమలకుమారి

నరసరావుపేట రూరల్: వేసవిలో పంట భూములు బీడుగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో సోమవారం రైతు శాస్త్రవేత్తల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ రైతు శాస్త్రవేత్తల నాలుగు సంవత్సరాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సెమిస్టర్ 2, 4 విద్యార్థులకు తరగతులు నిర్వహించినట్టు తెలిపారు. వేసవిలో పొలాలు ఖాళీగా ఉంచకుండా 30రకాల విత్తనాలతో కూడిన ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని పాటించాలని తెలిపారు. తోటలు ఇతర పంటలలో ఎల్ అకారపు కట్టలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీపీ కిరణ్మయి, డీపీపీ భవానిరాజు, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



ర్యాలీ చేస్తున్న అధికారులు

నూజెండ్ల: భూమిలో సేంద్రియ కార్బన్ శాతం తగ్గటం వల్ల పంట దిగుబడులు ఆశాజనకంగా ఉండటం లేదని వినుకొండ డివిజన్ ప్రకృతి వ్యవసాయ నిపుణులు బి.తిరుపతిరావు అన్నారు. మండలంలోని బి.అప్పాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం కార్యాచరణపై గ్రామసభ ర్యాలీ ప్రకృతి వ్యవసాయ నిపుణులు రైతులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధిస్తామన్నారు. క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. పైరులో యూరియా డీఏపీ, రసాయనిక ఎరువులు కాకుండా ఘన జీవ అమృతం వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, వి.అశోక్, రోశిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ శివలక్ష్మి ఉన్నారు.